క్లుప్తంగా...

మే, జూన్‌లలో డిగ్రీ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో మే, జూన్ నెలల్లో వివిధ డిగ్రీ కోర్సుల సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. గురువారం డిగ్రీ రెగ్యులర్‌తో పాటు బ్యాక్‌లాగ్, ఇతర పరీక్షల తేదీలు, సమయం వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న పండితులు

సనత్‌నగర్: ఎస్‌ఆర్‌నగర్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, కలశ జల సంప్రోక్షణ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి కుంభ నివేదన, హారతి, తిరువీధుల ఊరేగింపు మహోత్సవం కనుల పండువగా జరిగాయి. పూజల్లో కార్పొరేటర్ సరళ, చైర్మన్ బొద్దు కుమార్‌గౌడ్, ఈఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ తెలుగుశాఖ నుంచి టి.గిరీశం పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. ప్రొ.ఎస్‌ఆర్ వెంకటేశం పర్యవేక్షణలో తప్పట డుగులు యాదవ సాహిత్యం సమగ్ర పరిశీలన అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు.


గిరీశం

సోంప్రకాష్‌కు..



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం నుంచి సోంప్రకాష్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. రిటైర్డు ప్రొఫెసర్ ప్రశాంత ఆత్మ పర్యవేక్షణలో 'భారతదేశంలో పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రత–జాతీయ పెన్షన్ వ్యవస్థపై అధ్యయనం అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించడంతో డాక్టరేట్ పొందారు.

గురుకుల డీఎల్ ఉద్యోగాలకు అవకాశం కల్పించాలి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: యూజీసీ నెట్, టీఎస్–సెట్‌లో తాజాగా అర్హత సాధించిన అభ్యర్థులకు గురుకుల డిగ్రీల కాలేజీల అధ్యాపక ఉద్యోగాలకు అవకాశం కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు నరేష్ ఆధ్వర్యంలో విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. నెట్, సెట్ ఫలితాల్లో జాప్యంతో గురుకుల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కోల్పోయామని ఎన్నో ఏళ్ల తర్వాత వెలువడిన ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌లో అందరికి అవకాశం ఇవ్వాలని వినతిలో కోరారు.

అన్నదానం అభినందనీయం



సనత్‌నగర్: శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో బీకేగూడ పార్కు వద్ద కొనసాగుతున్న మధ్యాహ్న భోజన కేంద్రం వద్ద మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వ్యక్తిగత కార్యదర్శి హరీష్ గురువారం అన్నదానం చేశారు. తన జన్మదినం సందర్భంగా కుమారుడు భార్గవ్‌తో కలిసి భోజనం వడ్డించారు. శ్రీనివాస సమాజ సేవా సమితి ద్వారా వయోధికులు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా హరీష్ కొనియాడారు. గురువారం నాటి దాతలుగా హరీష్‌తో పాటు మస్తాన్‌రెడ్డి (కుమారుడు హేమంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా) ముందుకువచ్చారు. అనంతరం హరీష్‌ను సన్మానించారు. సంతోష్, కృష్ణారెడ్డి, విఠల్‌రెడ్డి, కృష్ణదేవ్, జే ప్రసాద్, అర్వింద్‌గౌడ్, జీఎస్‌టీ శాయి పాల్గొన్నారు.



అంబేడ్కర్ జయంతి సందర్భంగా దళిత రత్న అవార్డులు అందుకున్న కృష్ణ, నరసింహ, సత్యనారాయణ, శివకుమార్, శ్రీనివాస్‌లను బేగంపేటలోని శ్యాంలాల్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, మేడ్చల్–మల్కాజిగిరి జాయింట్ కలెక్టర్ నరసింహారెడ్డి అభినందించారు.
–సాక్షి, సిటీబ్యూరో

పైపులైన్లు వేశారు.. రోడ్డు మరమ్మతులు విస్మరించారు

- అసంపూర్తి పనులతో అవస్థలు
- రాకపోకలకు ఇబ్బందులు
- అధికారుల సమన్వయ లోపమే కారణమంటున్న స్థానికులు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో పలు బస్తీలో చేపట్టిన అభివృద్ధి పనుల అసంపూర్తితో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఉన్న సమస్యకు పరిష్కారం అయ్యిందనుకునే లోపు కొత్త సమస్యలు వచ్చాయని స్థానికులు వాపోతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇది తమకు సంబంధించింది కాదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పునరుద్ధరణ పనులపై నిర్లక్ష్యం..

గత కొంత కాలం క్రితం లాలాపేట సీతారామాంజనేయ భజన సమాజం వెనకాల ఉన్న బస్తీ, ఇందిరానగర్ కాలనీలో జలమండలి ఆధ్వర్యంలో నూతన పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి రోడ్డు పునరుద్ధరణ పనులను పెండింగ్‌లో పెట్టారు. సదరు కాంట్రాక్టర్ తీరుపై స్థానికులు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేస్తే అది తమ పని కాదు కేవలం పైపులైన్ పనులు చేయడమే తమది మిగతాది ఇంజినీరింగ్ వాళ్లదంటూ చెబున్నారు. ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే పైపులైన్ నిర్మాణ పనులు చేసిన వారే రోడ్డు పునరుద్ధరణ పనులు చేయాల్సి ఉంటుందని అంటున్నారు.దీంతో సమస్యల ఎవరికి చెప్పాలో అర్థంకాక కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డు పనులు చేపట్టాలని చెబుతున్న స్థానికులు


ఇందిరానగర్‌లో అసంపూర్తి పనులతో రోడ్డు దుస్థితి ఇలా ..

రాకపోకలలో ఇబ్బందులు..

ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తి పనులను తక్షణమే పూర్తి చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. లాలాపేట ప్రాంతంలో దాదాపుగా అన్ని చిన్నపాటి ఇరుగు గల్లీ వీధులే ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో పైపులైన్ నిర్మాణ పనులు చేసి సదరు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వదిలేశాడు. దీంతో చిన్నపాటి గల్లీ రోడ్లపై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్లపై వృద్ధులు, చిన్నారులు నడిచే క్రమంలో కిందపడి గాయాలకు గురవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం సరికాదు..



ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల అధికారుల నిర్లక్ష్య ధోరణి సరికాదు. ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో అన్ని విభాల అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ప్రజలకు కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఏదైనా అభివృద్ధి పనులు చేస్తున్న క్రమంలో ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాలి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
–కిరణ్‌కుమార్ గౌడ్, స్థానిక నాయకుడు

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని సెట్విన్ కేంద్రంలో అందించే వివిధ శిక్షణలను నియోజకవర్గ వాసులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సూచించారు. గురువారం ఆయన సెట్విన్ కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది, శిక్షణకు వచ్చిన వారితో ఆరా తీశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. 2021 సెప్టెంబర్‌లో సీతాఫల్‌మండి సెట్విన్ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో ప్రారంభించి ఇప్పటి వరకు వందల మందికి పైగా వివిధ అంశాల్లో శిక్షణను కల్పించామన్నారు. బ్యూటీషియన్, కంప్యూటర్, సీసీటీవీ, మొబైల్ రిపేర్, హోటల్ మేనేజ్మెంట్, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర అంశాలను నిపుణులైన శిక్షకుల ద్వారా అందిస్తున్నామన్నారు. వివిధ అధునాతన సదుపాయాలు, అన్ని వనరులను తాము సమకూర్చి ఏర్పాటు చేసిన సెట్విన్ శిక్షణా కేంద్రం కార్యాకలాపాల పట్ల ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపారు.


సెట్విన్ కేంద్రాన్ని సందర్శించిన పద్మారావుగౌడ్

పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం

టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్ ఈవీ నర్సింహారెడ్డి

సనత్‌నగర్: పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలుగా ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తోందని, ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలు అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఐఐసీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బేగంపేటలోని హరితాప్లాజా హోటల్‌లో జరిగిన కోవె తెలంగాణ చాప్టర్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టేవారికి ప్రభుత్వ అండగా ఉంటుందన్నారు. ఆర్థిక వ్యవస్థను పటిష్ట పర్చడంలో పారిశ్రామిక రంగం కీలకమన్నారు. ఈ రంగం నుంచి గతంలో 16–17 శాతం జీఎస్టీ ఉండగా ప్రస్తుం 20–22 శాతానికి పెరిగిందన్నారు. రానున్న ఐదేళ్లలో 30 శాతానికి చేరుకుంటుందన్న అభిప్రాయపడ్డారు. మహిళలు సానుభూతిని పొందేవారిగా ఉండకూడదని, సానుభూతితో ఎంతోమందికి అండగా నిలిచే స్థాయిలో ఉండాలన్నారు. కోవె లాంటి సంస్థల ద్వారా పారిశ్రామికవేత్తలు పరస్పరం సమాచారాన్ని పంచుకోవాలన్నారు. కోవె కోసం ఘన్‌పూర్ వద్ద స్థలం కేటాయింపు జరిగేలా ప్రయత్నిస్తానని చెప్పారు. కాగా కోవె తెలంగాణ చాప్టర్ అధ్యక్షురాలు చేతన్‌జైన్, సెక్రటరీలుగా కల్పనారావు, గొడవర్తి నీరజ, జాయింట్ సెక్రటరీగా అనురాధ, కోశాధికారిగా నిషా అగర్వాల్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో వీ–హబ్ సీఈఓ దీప్తి రావుల, షీ టీమ్స్, భరోసా ఏసీపీ ప్రసన్నలక్ష్మీ, కోవె మాజీ అధ్యక్షురాలు జోత్స్న చెరువు, సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ (గిజ్) చంద్రశేఖర్ రెడ్డి, డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ జాయింట్ డైరెక్టర్ ఎస్‌వీకే నగేష్ పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఈవీ నర్సింహా రెడ్డి

రేపు పీజీ కళాశాలలో అవార్డు ఉత్సవం

రసూల్‌పురా: డిగ్రీ, పీజీ విద్యార్థులు విద్య సాంస్కృతిక క్రీడా రంగాల్లో సాధించిన అవార్డులను పురస్కరించుకుని రేపు (శనివారం) ఫెస్టివల్ ఆఫ్ స్టూడెంట్స్ అచీవ్‌మెంట్ ఫోసా–2023 అవార్డుల ఉత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధ సికింద్రాబాద్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కుతాడి అర్జున్‌రావు తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తమ కళాశాలకు చెందిన డిగ్రీ, పీజీ విద్యార్థులు విద్యా, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో ప్రతిభ కనబర్చి అవార్డులు సాధించారని మిగిలిన విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, కవి, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, స్పోర్ట్స్ ఆథారిటీ చైర్మన్ అంజనేయులు గౌడ్, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ ఆర్తీజాదవ్, ఫ్యాకల్టీ డా.మృదుల, శ్రీధర్, పద్మ, డా.రవి, డా.మురళి, జే. నాగేశ్వర్‌రావు, హరిశంకర్, డా.సైదులు పాల్గొన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న ప్రొ. అర్జున్ రావు

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్: వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లి లోని మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించే ఆలోచనతోనే ప్రభుత్వం ప్రతి ఏడాది వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఏ రంగంలో ఆసక్తి కనబరుస్తున్నారో గుర్తించి వారిని ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా రెడ్డి, కార్పొరేటర్ దీపిక, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మోహన్ రెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి తలసాని

నిరుద్యోగుల పోరుకు రైతాంగం అండ


గుట్టయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

కిసాన్ సెల్ రాష్ట్ర నాయకుడు గుట్టయ్యగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగ నియామకాలలో జరిగిన అవినీతి, అక్రమాలపై పోరాడుతున్న నిరుద్యోగులు, ఓయూ విద్యార్థులకు అండగా ఉంటామని తెలంగాణ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెరుమండ్ల గుట్టయ్యగౌడ్ అన్నారు. తెలంగాణ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరంగల్ రవి అధ్యక్షతన ఓయూలో గురువారం జరిగిన సమావేశంలో గుట్టయ్యగౌడ్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రైతు సమస్యలతో పాటు నిరుద్యోగుల పోరాటాలకు కూడా కిసాన్ సెల్ అండగా ఉంటుందని గ్రామాల నుంచి రైతు, రైతుకూలీ కుటుంబాల నుంచి వచ్చి ఎంతో కష్టపడి చదివిన నిరుద్యోగుల ఉద్యమాలలో రైతులం ప్రత్యక్షంగా పాల్గొంటామన్నారు. తెలంగాణ ఉద్యమానికి మూల బింధువైన ఓయూ విద్యార్థులు నేడు నిరుద్యోగ సమస్యను ఎదుర్కోవడం బాధాకరమన్నారు. అనంతరం గుట్టయ్యగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. డాక్టర్ సతీష్, డాక్టర్ కిరణ్, ఆరావత్ సురేష్‌నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

రసూల్‌పురా: అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు అన్నానగర్‌కు చెందిన సీహెచ్. శ్రీలత అనారోగ్యానికి గురవడంతో సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆమెకు మంజూరైన రూ. 60వేల ఫండ్ చెక్కు గురువారం ఆయన పార్టీ నాయకులు పెద్దాల నరసింహతో కలిసి శ్రీలత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో వేలాది మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లబ్ధి చేకూరిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు బి. ప్రభాకర్ పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్ల వంకాయ 15, పొడుగు వంకాయ 15, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 38, పందిరిబీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 25, దొండ 13, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 10, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 35, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

చిరంజీవి మృతదేహానికి అర్ధరాత్రి పోస్టుమార్టం

గాంధీఆస్పత్రి: అస్వస్థతకు గురై మరణించిన పాత నేరస్తుడు చిరంజీవి మృతదేహానికి బుధవారం అర్ధరాత్రి సికింద్రాబాద్ గాంధీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలోని భూపేష్‌నగర్‌కు చెందిన ఆమూరి చిరంజీవిని ఓ కేసులో విచారణ నిమిత్తం తుకారంగేట్ పోలీసులు అదుపు తీసుకోగా, అస్వస్థతకు గురై మృతి చెందిన విషయం విదితమే. మృతుని కుటుంబసభ్యులతో బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు పోలీసులు చర్చలు సాగించగా పోస్టుమార్టంకు ఒప్పుకున్నారు. ఫోరెన్సిక్ మెడిసిన్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ కృపాల్‌సింగ్ నేతృత్వంలో వైద్య బృందం చిరంజీవి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వీడియో కెమెరాలతో చిత్రీకరించారు. విస్రాతోపాటు పలు అవయవాలకు చెందిన నమూనాలను సేకరించి హిస్టోపెథాలజీ, ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు పంపించారు. ఫిట్స్‌తో మృతి చెందినట్లు పోలీసుల పంచానామాలో ఉందని, మృతుని శరీరంపై ఉన్న చిన్నపాటి గాయాలు ఫిట్స్‌తో కిందపడి కొట్టుకోవడంతో ఏర్పడినవిగా భావిస్తున్నామని, హిస్టోపెథాలజీ, ఫోరెన్సిక్ ల్యాబ్‌ల నుంచి అందే నివేదికల ఆధారంగా మరణానికి గల కారణాలు శాస్త్రీయంగా వెల్లడవుతాయని గాంధీ ఫోరెన్సిక్ విభాగ వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అంబులెన్స్‌లో భూపేష్‌నగర్‌కు తరలించామని చిలకలగూడ సీఐ నరేష్ తెలిపారు.

బాధిత కుటుంబానికి న్యాయం జరగాలి

అడ్డగుట్ట: చోరీ కేసులో అనుమానితుడైన చిరంజీవి కస్టోడియల్ డెత్‌కు కారకులైన పోలీసులను చట్టపరంగా శిక్షించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. కేసు విచారణలో భాగంగా మంగళవారం సాయంత్రం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ తీసుకొచ్చిన ఆటో డ్రైవర్ చింరజీవి అస్వస్థకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. మృతుడి వదిన హాసిని ద్వారా అదే రోజు విషయం తెలుసుకున్న పౌర హక్కుల సంఘం ప్రతినిధులు గురువారం బాధితులను కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మృతుడు చిరంజీవిది లాకప్ డెత్ అని ఫిట్స్‌తో చనిపోయాడని పోలీసులు చెబుతున్న మాటల్లో వాస్తవం లేదన్నారు. థర్డ్ డిగ్రీ చిత్రహింసల వలనే అతను మృతి చెందాడని పౌర హక్కుల సంఘం నిజ నిర్ధారణలో తేలింది కాబట్టి ఇది తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన లాకప్ డెత్‌గానే భావిస్తామన్నారు. ఆస్పత్రిలో చికిత్స అందించి ఉంటే ఫస్ట్ ఎయిడ్ చేసి కట్టు కట్టేవారని, ఎలాంటి చికిత్స లేకుండా నేరుగా మార్చురీకి తరలించినట్లుగా కనిపిస్తుందని ఈ విషయాలపై గాంధీ యాజమాన్యం ప్రవర్తించిన తీరు బహిర్గతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఘటనకు సంబంధించి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మృతుని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం, అతని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ రావు, శ్యామల రావు, విష్ణువర్ధన్, తాళ్లపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.


మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం ప్రతినిధులు

కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలి

చిలకలగూడ: మేడే అందించిన పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని ఏఐటీయూసీ ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కొమురెల్లి బాబు పిలుపునిచ్చారు. మెట్టుగూడ డివిజన్ మైలార్‌గడ్డ ఆటోస్టాండ్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న హక్కులను హరిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి సరైన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు షేక్‌లతీఫ్, గడ్డం చందర్, రమేష్, జయరాములు, యాకయ్య, ఎల్లయ్య, యాదగిరి పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి

బౌద్ధనగర్: స్థానిక సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నామని కార్పొరేటర్ కంది శైలజ తెలిపారు. గురువారం వివిధ విభాగాల అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని అంబర్ నగర్ కట్ట పరిసర ప్రాంతాల్లో ఆమె పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ వెంట అధికారులు ప్రియాంక, శ్రీనివాస్, యాదగిరి, చంద్రశేఖర్, శ్రీనివాస్, శివరాజ్, ఎస్ఐ రమేష్ నాయకులు సతేలు కుమార్, రాజేష్, రాకేష్, భాగ్య, సుజాత, జయశ్రీ ఉన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న కంది శైలజ

ఆవిర్భావం.. అంబరం

సనత్‌నగర్/బన్సీలాల్‌పేట్: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఘనంగా నిర్వహించారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్ల ఆధ్వర్యంలో పార్టీ జెండాలు ఎగరవేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బన్సీలాల్‌పేట్‌లో పార్టీ జెండాను కార్పొరేటర్ కె. హేమలత ఆవిష్కరించగా, వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జెండాలను పవన్‌కుమార్ గౌడ్ ఆవిష్కరించారు.


జెండా ఆవిష్కరించిన కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి


జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ హేమలత

కన్నకొడుకు వదిలేశాడు.. పరాయివారు చేరదీశారు

సనత్‌నగర్: నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని ఓ ఆశా వర్కర్ పోలీసుల సహాయంతో అనాథాశ్రమంలో చేర్పి మానవత్వాన్ని చాటుకుంది. బల్కంపేట ఎల్లమ్మ–పోచమ్మ దేవస్థానం ఆవరణలోని భక్తుల వసతి కాంప్లెక్స్ వద్ద నడవలేని స్థితిలో 65–70 వయస్సున్న ఓ వృద్ధురాలిని భాగ్య అనే ఆశావర్కర్ గమనించి ఆమె దగ్గరికి వెళ్లి ఆప్యాయంగా పలకరించింది. తన పేరు రత్న రాములమ్మ తమది శ్రీకాకుళం అని.. తన కుమారుడు ఇక్కడకు తీసుకువచ్చి వదిలేసి వెళ్లాడని వృద్ధురాలి తన గోడు వెళ్లబోసుకుంది. దీంతో భాగ్య ఆమెను ఆటోలో తీసుకుని ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఆమె పరిస్థితి చూసిన పోలీసులు వివిధ అనాథాశ్రమాలను సంప్రదించారు. అయితే అనారోగ్యంగా ఉన్న ఆమెకు తాము ఆశ్రయమివ్వలేమని చెప్పారు. చివరకు అడ్మిన్ ఎస్ఐ బాలరాజు తన సొంత ఖర్చుతో ఆటోలో రత్న రాములమ్మను ఈసీఐఎల్ సమీపంలోని లూథ్‌మాత ఆశ్రమానికి పంపించారు.

